క్లుప్తంగా

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ ఆంథోని స్వామి

పులివెందుల టౌన్ : ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19, 20, 21వ తేదీల్లో జరిగిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లలో పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంథోనిస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు బెస్ట్ ఇన్ స్పోర్ట్స్, బెస్ట్ ఇన్ గేమ్స్ పోటీలలో విద్యార్థులు విజేతలుగా నిలిచి, ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారన్నారు. అలాగే ఈ నెల 19, 20వ తేదీలలో కడప ప్రభుత్వ ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ పోటీలలో బెస్ట్ ఇన్ అథ్లెటిక్స్, ఖోఖోలలో విద్యార్థిని డి.హారిణి రన్నర్స్‌గా నిలిచిందని తెలిపారు. వీరిలో 26మంది బాలలు, ఒక బాలిక స్టేట్ మీట్‌కు అర్హత సాధించారని, వీరంతా జనవరి 28, 29, 30వ తేదీలలో విశాఖపట్టణంలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంథోని స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో, వ్యాయామ అధ్యాపకులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

నూతన భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎన్ఆర్ఐ రాఘవేంద్రారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు తొడిమె నాగిరెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కుమారుడు ఎన్ఆర్ఐ రాఘవేంద్రారెడ్డి వీరనారాయణస్వామి అంధుల ఆశ్రమం, దీనబంధు ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన స్నేహిత అమృతహస్తం సేవా సమితి నూతన భవన నిర్మాణానికి రూ.5,116 చంద్ర ఓబుళరెడ్డి, రఘునాథరెడ్డి చేతులమీదుగా సేవా సమితి అధ్యక్షుడు రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సేవా సమితి భవన నిర్మాణానికి తమవంతుగా విరాళాలు అందించాలని కోరారు.

రాజీవ్‌నగర్ దళితవాడలో నీటి కష్టాలు



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న రాజీవ్ నగర్ వాసులు

చక్రాయపేట: మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ దళితవాడలో తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. కొంతకాలంగా బోర్లలోని మోటార్లు కాలిపోయాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని దళితవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చక్రాయపేట ఉప సర్పంచ్ గంగిరెడ్డి సూచన మేరకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్ర ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తూ ప్రజల అవసరాలను తీరుస్తున్నాడు. అధికారులు స్పందించి వెంటనే బోర్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారిణికి ఘన సన్మానం



శ్రీ చరణిని సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ నాయుడు

వీరపునాయునిపల్లె: మహిళా ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌కు ఎంపికైన శ్రీ చరణిని సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ నాయుడు మాట్లాడుతూ దేశ స్థాయిలో గుర్తింపు తెచ్చిన శ్రీ చరణిని ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. రాబోవు రోజుల్లో భారత మహిళా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, డిగ్రీ కళాశాల విశ్రాంతి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కడప కల్చరల్ : పండుగలన్నీ మత సహనాన్ని ప్రబోధిస్తాయని నగర ప్రముఖులు ఆలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని మరియాపురం చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి విశ్వాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసు ప్రభు ప్రపంచానికి శాంతి, సమాధానాలు అందించారని తెలిపారు.

లోక రక్షకుడి కోసం..

క్రిస్మస్ కథ.. దేవుని పుత్రుడైన ఏసు క్రీస్తు మానవుడిగా మారిన కథ. తన ప్రియ సుతుడైన ఏసును ఈ లోకానికి దేవుడు రక్షకునిగా పంపాడు. ఆయన రాకను దేవదూత ముందుగానే ప్రకటిస్తూ.. ఏసు జననం మానవాళి అందరికీ గొప్ప ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పాడు. ఆయన జననం ఈ లోకానికి ఒక శుభవార్త. ఒక శుభవార్తను వినడం ఒక వేడుకైన సందర్భం. ఆ సందర్భమే ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకొనే క్రిస్మస్ పర్వదినం అయ్యింది.





విద్యుత్ దీపాల అలంకరణలో సీఎస్ఐ చర్చి



యర్రగుంట్ల సీఎస్ఐ చర్చిలో ఏర్పాటు చేసిన క్రీస్తు జననం సెటింగ్

- మొదలైన క్రిస్మస్ సందడి
- దేదీప్యమానంగా చర్చిలు
- క్రీస్తు జనన సందేశాన్ని ఇవ్వనున్న దైవజనులు

ఎర్రగుంట్ల : క్రిస్మస్ వేడుకులకు పట్టణం సిద్ధమైంది. ఏసుక్రీస్తు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను నిర్వహిస్తారు. మంగళవారం జరిగే క్రిస్మస్ పండుగకు క్రైస్తవ సంఘాలతో పాటు క్రైస్తవేతరులు కూడా వేడుకలు నిర్వహించనున్నారు. యర్రగుంట్ల పట్టణంతో పాటు గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. పండుగ సమీపిస్తుండటంతో చర్చిలను ఆయా సంఘాల పెద్దలు ముస్తాబు చేస్తున్నారు. పలు చోట్ల క్యాండిల్ లైట్ సర్వీసులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు జరుపుతున్నారు.

చర్చిల అలంకరణ

పట్టణంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, ఓరెబు, ఓసన్న, మారతోమ, మన్నా చర్చిలతో గ్రామాల్లోని అన్ని చోట్ల చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణంలో రైల్వే పాత గేటు వద్ద సీఎస్ఐ చర్చి చాలా పూరతమైన చర్చిగా గుర్తింపు ఉంది. ఇక్కడ క్రీస్తు జననానికి సంబంధించిన నమూనా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఇది చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అలాగే క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి రంగురంగుల పేపర్లతో అలంకరిస్తున్నారు. చర్చిల అవరణంతా లైటింగ్‌తో పెద్ద స్టార్‌ల గుర్తును ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఆయా చర్చిలకు సంబంధించిన పాస్టర్లు క్యాండిల్ లైట్ సర్వీసులను నిర్వహిస్తూ భక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రార్థనలు ఏర్పాటు చేసి, దైవా సందేశాన్ని అందిస్తున్నారు. కొంత మంది ప్రత్యేకమైన సమావేశాలను ఏర్పాటు చేసి సపోస్ క్రిస్మస్, సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నారు.

ఎంపీ ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురం సమీపంలోని తన నివాసంలో సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించి విధంగా చర్యలు చేపడతామన్నారు. అలాగే రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన చేపట్టిన విద్యుత్ బకాయిలపై ట్రాన్స్‌కో కార్యాలయాల వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వాటిని ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా దర్బార్ ద్వారా సమస్యలను ఎప్పుడు తమ దృష్టికి తీసుకు వచ్చిన వాటిని పరిష్కరించి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

పులివెందుల పట్టణంలోని భాకరాపురంలోని తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు మాడిశెట్టి శివకుమార్, వై.జయరామకృష్ణారెడ్డి, దాసరి మల్లారెడ్డి, మల్లు కేశవరెడ్డి, కందుకూరు సురేష్, బాబులు కలిసి ఈ నెల 11వ తేదీన ఎర్రగుంట్లలో పుట్ ఓవర్ రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయని, ఈ పనులకు మీరు, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అందువల్ల వైఎస్సార్‌సీపీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎంపీకి వివరించారు.



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైకల్యం శరీరానికే కానీ.. సంకల్పానికి కాదు



దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్స్ అందజేస్తున్న ఎంఈఓలు

సింహాద్రిపురం: వైకల్యం శరీరానికే కానీ.. సంకల్పానికి కాదని ఎంఈఓలు ఓబులేసు, శారద వ్యాఖ్యానించారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రంలో ఐఆర్పీల ద్వారా ఇస్తున్న ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సుధీర్ ద్వారా వైద్య సేవలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగ పిల్లలను చేర్పించడం వలన వారికి విద్యతో పాటు సమాజంపైన అవగాహన వస్తుందన్నారు. అనంతరం ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు సీపీ చైర్స్‌లను అందజేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఐఆర్‌పీ షాహిద్ బాషా, ఇమ్తాద్, మండల సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కొండాపురం: నంద్యాలలో బీసీజీ కాటన్ ఇండస్ట్రీస్‌లో ప్రత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏపీ రామంజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి పంటను రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ప్రభుత్వం గుర్తించిన జిన్నింగ్ మిల్లుకు తీసుకుపోవాలన్నారు. పత్తిని లుజుగా గానీ గోనె సంచుల్లో తీసుకెళ్లాలని సూచించారు. పత్తి గింజ పొడవు 30.50 ఎంఎం వరకు ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

మామిళ్లపల్లెలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో అధికారులు

చింతకొమ్మదిన్నె : కడప నగరంలో విలీనమైన చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని మామిళ్లపల్లిలో సోమవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అత్యధికంగా 72 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సదస్సులో ప్రజల నుంచి ఎక్కువగా భూముల ఆన్‌లైన్, మిగులు భూముల సమస్య, డీకేటీ భూములు మ్యూటేషన్, నమోదు కొరకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె గ్రామ రెవెన్యూ సదస్సును చింతకొమ్మదిన్నె సచివాలయంలో నిర్వహించనున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆటోడ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు హరి

కొండాపురం: ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై. హరి కోరారు. సోమవారం కొండాపురంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాహన మిత్ర రూ.15 వేలు, జీవిత బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల చంద్రన్న బీమా వర్తింప చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీలను అమలు చేయకుంటే భవిష్యత్‌లో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సదరం శిబిరానికి 20 మంది హాజరు



దరఖాస్తుదారుడి సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న వైద్యాధికారి రామ్మోహన్

కమలాపురం: స్థానిక సీహెచ్‌సీలో జరిగిన సదరం శిబిరానికి 20 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సదరం స్లాట్ బుక్ చేసుకున్న వివిధ అంగవైకల్యం కలిగిన వారు సోమవారం స్థానిక సీహెచ్‌సీలో జరిగిన సదరం శిబిరానికి హాజరయ్యారు. శిబిరానికి కడప రిమ్స్ నుంచి హాజరైన ఆర్థో వైద్య నిపుణులు రామ్మోహన్ దొర అభ్యర్థుల దరఖాస్తుదారులను పరీక్షించారు. అలాగే వారి వద్ద ఉన్న సర్టిఫికెట్లను పరిశీలించారు. కాగా సీహెచ్‌సీ వైద్యాధికారి తాజుద్దీన్ మాట్లాడుతూ వివిధ సమస్యలున్న వారు సదరం స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో శిబిరానికి హాజరై సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. కమలాపురం సీహెచ్‌సీ ప్రతి సోమవారం సదరం శిబిరం నిర్వహిస్తామన్నారు. అయితే స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు పంపిణీ



అంగన్‌వాడీ కార్యకర్తలకు పుస్తకాలు అందజేస్తున్న సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు పీపీ1, పీపీ2 పుస్తకాలను పంపిణీ చేసినట్లు సీడీపీఓ శ్రీలత తెలిపారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శ్రీలత అంగన్‌వాడీ కార్యకర్తలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు టీచర్లకు స్పోకెన్ ఇంగ్లీష్, మాథ్స్, ఇంగ్లీష్ యాక్టివిటీ, తెలుగు యాక్టివిటీ పుస్తకాలు ఇస్తామని ఆమె తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జీవితంలో గణితం అవసరం



విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలతో ఉపాధ్యాయురాలు

వేంపల్లె : జీవితంలో గణిత శాస్త్రం అవసరమని వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ గణితంతో సంబంధమైన అనేక ప్రాజెక్టులు ప్రదర్శించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు ఏ రంగంలో స్థిరపడాలన్నా గణిత శాస్త్రంలో పట్టు సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను గణిత శాస్త్ర ప్రాధాన్యాన్ని గురించి వివరించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను పాఠశాల కరెస్పాండెంట్‌తో పాటు మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య రెడ్డి, చేతన్ రెడ్డి సందర్శించి ప్రాజెక్టుల గురించి వివిధ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

పంట కోత ప్రయోగాలను పరిశీలించిన ఏఓ



ఆముదం పంటను పరిశీలిస్తున్న ఏఓ శివమోహన్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామంలో సాగు చేసిన ఆముదం పంటలో నిర్వహిస్తున్న పంట కోత ప్రయోగాలను సోమవారం ఏఓ శివమోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ శివమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రబీలో సాగు చేసిన ఉద్ది, బుడ్డశనగ పంటలకు నిర్వహించే పంట కోత ప్రయోగాలను జిల్లా చీఫ్ ప్లానిగ్ ఆఫీసర్ ఇచ్చిన సర్వే ప్రకారం ఫారం-1 నింపి నిర్ణీత సమయంలో సీపీఎస్ ఆఫీస్‌కు అందించాలన్నారు. ఇందుకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ మహేంద్రనాథరెడ్డి, వీహెచ్ఓ భువనేష్, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

–వేడుకల్లో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

లింగాల : లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలను ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయనకు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అదేవిధంగా గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సోమవారం వేద పండితులు గోపూజ, గంగ పూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, స్వస్తివాచకం, విగ్రహ జలాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

రేపు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శిల్పారామం, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో క్రిస్మస్ సందర్భంగా బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటలరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ ఏఓ సుధాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శిల్పారామంలో పులివెందుల నాగార్జున ఎక్సలెంట్ స్కూలు చిన్నారులతో నృత్య ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో పులివెందుల రామాంజి జ్యువెలర్స్, పీఎస్వీ జ్యువెలర్స్, డీకే సావర్కర్ ట్రావెల్స్‌ల ఆధ్వర్యంలో మదనపల్లె సూర్య డాన్స్ అకాడమీ చిన్నారులతో జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. పులివెందుల ప్రాంత ప్రజలు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా కాలభైరవస్వామి జయంతి



విశేష అలంకారంలో కాలభైరవస్వామి

కడప కల్చరల్ : కడప నగరం కాలభైరవపురంలోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ఆధునీకరించినంతరం జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేకించి ఈ ఆలయ ప్రత్యేక పూజల్లో ప్రధానమైన కుష్మాండ దీపరాధన (గుమ్మడికాయ దీపం)తో కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఒక దశలో చోటు చాలకపోవడంతో మూడు బృందాలుగా భక్తులచే కుష్మాండ పూజ నిర్వహింపజేశారు. ఈ పూజలో 500 మంది భక్తులు పాల్గొన్నారు. కాలభైరవపురాన్ని దత్తత తీసుకున్న బాసట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మేరువ బాలాజీరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అష్టోత్తర పారాయణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల బృందం హోమాన్ని చేపట్టారు. భక్తులకు పెద్ద ఎత్తున తరలి రావడంతో అన్నదానానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది.

ఓపెన్ పాఠశాలల యాజమాన్యంపై ఫిర్యాదు



డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పాఠశాలలను నిర్వహించకుండా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓపెన్ పాఠశాలలు తరగతులు నిర్వహించకుండా ఫీజులు వసూలు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని వెంటనే అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 7వేలకు పైగా ఓపెన్ విద్యకు అభ్యసకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే జిల్లాలో ఎక్కడ కూడా తరగతులు నిర్వహించకుండా కేవలం పరీక్షల సమయంలో మాత్రమే హాల్ టికెట్ జారీ చేసి అభ్యర్థుల నుంచి వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

విలువలు చట్టాని కంటే బలీయమైనవి

కడప ఎడ్యుకేషన్ : విలువలు అనేవి చట్టానికంటే బలీయమైనవని మానవతా సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపీ పేర్కొన్నారు. సోమవారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో బాల వికాస్ హైస్కూల్‌లో 9,10 తరగతుల విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సెక్రటరీ బీవీ సుబ్బారాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు సమాజంలో దైవ సమానులన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు భూపతి రాయల్, పాఠశాల డైరెక్టర్ గంగయ్య, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారాయుడు, ప్రిన్సిపాల్ ఉషాపాల్గొన్నారు. అనంతరం 9, 10 తరగతి విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్, నగదు, మెమెంటోలను మానవతా సంస్థ వారు అభినందించారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా..?



కాలువలో పెరిగిన జమ్ము



లైనింగ్ కూలి కాలువలో పడుతున్న మట్టి



గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

- ఆయకట్టుకు అందని నీరు
- పట్టించుకోని అధికారులు

ఎర్రగుంట్ల: అన్నదాతలు సక్రమంగా తమ పొలాల్లో పంటలు పండించాలంటే వర్షాలు రావాలి, జలాశయాలు నిండాలి, ఆ నీరు కాలువల ద్వారా పొలాలకు చేరాలి. అయితే జలాశయాల్లో నీరున్నా అధికారులు పొలాలకు నీరు వదిలితే మాత్రం ఆ నీరు పొలాలకు చేరే అవకాశం కనిపించడంలేదు. మండల పరిధిలో ఉన్న మైలవరం దక్షిణ కాలువ పూర్తిగా దెబ్బతింది. లైనింగ్ పగిలిపోయి చాలా అధ్వానంగా ఉంది. ఈ కాలువ మైలవరం రిజర్వాయర్ నుంచి నీటిని కమలాపురం మండలం ఛానల్ వరకు ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందుతోంది. అయితే ఆర్టీపీపీ, కలమల్ల సమీపంలో కాలువ పూర్తిగా దెబ్బతింది. అంతేకాకుండా ఆర్టీపీపీ నుంచి వచ్చే బూడిదతో కాలువ నిండిపోయింది. దీనికితోడు జమ్ము చెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. సంబంధిత అధికారులు కాలువ మెయింటైన్ పనులపై నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. యర్రగుంట్ల మండలంలోని రైతులకు ఈ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు పంటలకు జీవనాధారంగా మారింది. కలమల్ల గ్రామంలోని వంకలో కాలువకు గండి పడి నీరు వృథాగా పోతోంది. అధికారులు దృష్టి సారించి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.